నల్లగొండకు చెందిన సురేశ్‌గుప్తా పర్యావరణంపై అవగాహన కల్పిస్తూ.. హైదరాబాద్‌లోని నాంపల్లిలో గల తెలుగు యూనివర్సిటీలో ప్రజల్లో చైతన్యాన్ని నింపుతున్నాడు. నగరంలో ఎక్కడ ఏ కార్యక్రమమైనా పర్యావరణ పోస్టర్‌ను ప్రదర్శించి చైతన్య పరుస్తున్నాడు. ఆదివారం నమస్తే తెలంగాణ కెమెరా ఈ దృశ్యాన్ని క్లిక్‌మనిపించింది.

మతోన్మాద బీజేపీని ఐక్యంగా అడ్డుకుందాం

- సీపీఐఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యుడు వెంకటేశ్వర్‌రావు

సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్‌రావు

బొడ్రాయిబజార్, డిసెంబర్ 17 : దేశ లౌకిక వ్యవస్థ, ప్రజాస్వామిక హక్కులకు ప్రమాదకరంగా మారుతున్న బీజేపీ మతోన్మాదాన్ని ప్రజలు, ప్రజాస్వామిక వాదులు ఐక్యంగా అడ్డుకోవాలని సీపీఐఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యుడు గోకినపల్లి వెంకటేశ్వర్‌రావు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక విక్రమ్ భవన్‌లో పేర్ల నాగయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన జిల్లా జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఐఎంఎల్, సీపీఐఏఎల్ ప్రజాపంథా, సీపీఐ ఎంఎల్ రివల్యూషనరీ ఇనిషియేటీవ్ మూడు విప్లవ పార్టీల ఐక్యత సందర్భంగా వచ్చే ఏడాది మార్చి 3, 4, 5 తేదీల్లో ఖమ్మంలో నిర్వహించే మహాసభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్‌కుమార్, కోదాడ డివిజన్ కన్వీనర్ మట్టపల్లి అంజయ్య, ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు వేర్పుల లక్ష్మయ్య, అరుణోదయ జిల్లా కన్వీనర్ గొడ్డలి నర్సయ్య పాల్గొన్నారు.

ధనుర్మాస మహోత్సవాలు ప్రారంభం

భజనలు చేస్తూ పాటలు పాడుతున్న మహిళా భక్తులు

బొడ్రాయిబజార్, డిసెంబర్ 17 : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం ధనుర్మాస వ్రత మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున స్వామి వారికి సుప్రభాత సేవతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆండాల్ గోష్ఠి మహిళా భక్తులు మంగళ హారతులతో దేవాలయానికి చేరుకుని గోదా శ్రీనివాసుడి అష్టోత్తర శత నామాలు పటించి తిరుప్పావై చదివారు. ఆలయ ప్రధాన అర్చకుడు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు ధనుర్మాస వైభవాన్ని, తిరుప్పావైలోని మొదటి పాశుర అర్థాన్ని భక్తులకు వివరించారు. కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి వై.శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్, కరుణాకర్‌రెడ్డి, మంజుల, జ్యోతి, జ్ఞానకుమారి పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామికి పూజలు నిర్వహిస్తున్న మాలధారులు

మాలధారులకు మైనార్టీ నాయకుడి అన్నదానం

బొడ్రాయిబజార్, డిసెంబర్ 17 : అయ్యప్ప మాలధారులకు సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ మైనార్టీ నాయకుడు షకీల్ ఆదివారం అన్నదానం నిర్వహించారు. పట్టణంలోని 20వ వార్డులో అయ్యప్ప మాలధారులు 100 మందికి అన్నదాన వితరణ చేశారు. కార్యక్రమంలో గురుస్వామి అరిగె శ్రీనివాస్, చలపతి రావు, నాగరాజు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

సంక్రాంతి లోపు ఇందిరమ్మ ఇండ్లు అందజేస్తాం

- ఆగిపోయిన ప్రాజెక్ట్‌లను పూర్తి చేసుకుందాం
- నకిరేకల్ విజయోత్సవ ర్యాలీలో రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

నకిరేకల్ పట్టణంలో విజయోత్సవ ర్యాలీలో మాట్లాడుతున్న రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్, డిసెంబర్ 17 : వచ్చే సంక్రాంతి పండుగ లోపు ఇందిరమ్మ ఇండ్లను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందజేస్తామని, ఆగిపోయిన ప్రాజెక్ట్‌లను త్వరలోనే పూర్తి చేసుకుందామని తెలంగాణ రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం విజయోత్సవ ర్యాలీని ఆదివారం నకిరేకల్ బైపాస్ పద్మానగర్ జంక్షన్ నుంచి నకిరేకల్ మెయిన్ సెంటర్ ఇందిరాగాంధీ సెంటర్ వరకు నిర్వహించారు. అంతకుముందు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశంను కార్యకర్తలు, అభిమానులు భారీ గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ నకిరేకల్ ఎమ్మెల్యేగా వేముల వీరేశాన్ని భారీ మెజార్టీతో గెలిపించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ ప్రవేశపెట్టిన 6 గ్యారెంటీ స్కీముల్లో ఇప్పటికే 2 గ్యారంటీలను అందిస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ.. ప్రజలకు ఇబ్బందులు లేకుండా నకిరేకల్ పట్టణ రోడ్లను అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఇళ్లులేని వారందరికీ ఇళ్లు కట్టిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, రాష్ట్ర శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ మ్యానిఫెస్టో మెంబర్ చామల శ్రీనివాస్,

రాష్ట్ర నాయకులు దైద రవీందర్, పూజర్ల శంభయ్య, నకిరేకల్ ఎంపీపీ శ్రీదేవీగంగాధర్‌రావు పాల్గొన్నారు.

కనుల పండువగా కావడి మహోత్సవం

బొడ్రాయిబజార్, డిసెంబర్ 17 : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని రామలింగేశ్వరస్వామి దేవాలయంలో సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా ఆదివారం నిర్వహించిన పాల కావడి మహోత్సవం కనుల పండువగా జరిగింది. కర్ణాటక, తమిళనాడులో తప్ప మరెక్కడా చూడని విధంగా సుబ్రహ్మణ్య సమేత శ్రీవల్లి దేవసేన విగ్రహాలతో పట్టణంలోని ప్రధాన వీధుల గుండా పాల కావడిలతో భక్తులు శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు రెంటాల సతీశ్‌శర్మ, దేవాలయ నిర్వహణ కమిటీ సభ్యులు అనంతుల సూర్యనారాయణ, అనంతుల దుర్గాప్రసాద్, అనంతుల శ్రీనివాస్, సుబ్రహ్మణ్య సేవా సమితి వాసా కృష్ణ బృందం పాల్గొన్నారు.

బొడ్రాయిబజార్ : పాల కావడిలతో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

సూర్యక్షేత్రంలో పూజలు

అర్వపల్లి : మండల పరిధిలోని తిమ్మాపురంలో గల సూర్య దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహా సౌర హోమం నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

పస్తాల చర్చిలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న సోనియా జాన్

ఘనంగా సెమీ క్రిస్మస్

నాగారం, డిసెంబర్ 17 : మండలంలోని పస్తాల గ్రామంలో బేతేలు కమ్యూనిటీ సెంటర్‌లో ఆదివారం సోనియా జాన్ ఆధ్వర్యంలో సెమి క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 500 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ జాన్‌మార్క్, సాల్మన్‌ముల్ల, రాజు, సతీశ్, యోహాను బాబు, జాన్ జాకబ్ పాల్గొన్నారు.

ఎడ్ల బండ్లకు రేడియం స్టిక్కర్లు అందజేత

నాగారం, డిసెంబర్ 17 : సూర్యాపేట– జనగామ జాతీయ రహదారి 365బి పై ప్రమాదాల బారిన పడకుండా వాహనదారులను అప్రమత్తం చేసేందుకు మండలంలోని ఫణిగిరి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు నాగు వెంకన్న, ఆలకుంట్ల బాలకృష్ణ రేడియం స్టిక్కర్లను బహుకరించారు. ఈ స్టిక్కర్లను ఎడ్లబండ్లకు ముందు వెనుక అంటించారు. రాత్రి వేళలో ఎడ్ల బండ్లు కనిపించకపోవడం మూలంగా ప్రమాదాలు జరుగుతున్నాయనే ఉద్దేశంతో రేడియం స్టిక్కర్లను అందించినట్లు ఈ సందర్భంగా వారు తెలిపారు.

ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం ఉపాధి చూపాలి

- యూనియన్ మండల అధ్యక్షుడు సైదులు

నూతనకల్, డిసెంబర్ 17 : మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల రోడ్డున పడ్డ ఆటో డ్రైవర్లకు ఉపాధి చూపించాలని ఆటో డ్రైవర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు ముల్కలపల్లి సైదులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆటో కార్మికుల బాధలను సీఎం రేవంత్‌రెడ్డి పరిగణలోకి తీసుకోవాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు శ్రీనివాస్, నరేశ్, సైదులు, ముత్తయ్య, వంశీ, రవి, శ్రీకాంత్, కిట్టు, మహేశ్ పాల్గొన్నారు.

ఢిల్లీ జంతర్‌మంతర్ ధర్నాను విజయవంతం చేయాలి

- ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పరశురాములు

నూతనకల్, డిసెంబర్ 17 : ఈ నెల 20న ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని సంఘం మండల అధ్యక్షుడు పాల్వాయి పరశురాములు కోరారు. ఆదివారం మండల కేంద్రంలో చలో ఢిల్లీ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. సమావేశంలో చిరంజీవి, నాగన్న, వెంకన్న, సైదులు, రవి, మహేశ్, రాములు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

అర్వపల్లి, డిసెంబర్ 17 : అర్వపల్లి మండల కేంద్రానికి చెందిన కోమారి భిక్షం ఇటీవల మృతిచెందాడు. కుటుంబ సభ్యులకు ఆదివారం లక్ష్మీ నరసింహ హమాలీ సంఘం రూ.10 వేలు, సిమెంట్ ఐరన్ షాపుల నిర్వాహకులు 11 వేలు, ఫర్టిలైజర్స్ దుకాణాదారులు రూ.4 వేలు అందజేశారు. కార్యక్రమంలో హమాలీ సంఘం అధ్యక్షుడు, సభ్యులు పాల్గొన్నారు.